# దేవుని జీవితం

"దేవుడున్నాడా, లేడా?" అనే ప్రశ్న పాతబడి పోయింది; ఈ రోజుల్లో ఈ ప్రశ్న వేస్తే రసాయన శాస్త్రజ్ఞులు. "భగవంతుడు అనవసరంగా సృష్టింపబడ్డ తార్కికుల ఊహామాత్రుడు" అంటారు. నవనాగరికులం అనుకునేవాళ్లు, "ఇన్నాళ్ళనుంచీ ఏంచేస్తున్నావురా అబ్బాయ్; ఇప్పుడు లేచావ్!" అంటారు.

"15వ శతాబ్దం దగ్గరనుంచీ యీ విషయం ఆలోచించేవాళ్ళే లేరు. అప్పటి కప్పుడే షేక్స్పియర్ గారికి దేవుడు లేడు" అన్నది హాగారి కారవాన్ ఆఫ్ ది క్యూరియస్‌లోని వో పాత్ర...

ఒక నల్లమ్మాయి దేవునికోసం వెతకటం ప్రారంభించింది. ఏంచేస్తే దేవుడు కనబడతాడని విన్నదో అవన్నీ చేసింది. ఎక్కడ దేవుడు వుంటాడని విన్నదో అక్కడికల్లా వెళ్ళింది. ఒకరోజు ప్రయాణం చేస్తున్న ఒక గుంపుని చూచింది.

"మీరు వెదికేది దేవునికోసమా?" అని వెంటనే అడిగింది. వాళ్ళా పరిహాసానికి డొక్కలు చెక్కలయ్యేటట్టు నవ్వుకున్నారు. నిద్రించేవాళ్లు మేల్కొని "ఏమిటి?" అని అడిగి ఆ అమ్మాయి చిత్రమైన ప్రశ్నవిని, అందరూ కలిసి గగ్గోలుగా నవ్వుకున్నారు. "పిచ్చిపిల్ల! ఎప్పటి దేవుడూ, ఎప్పటి కథా!" అని ఆశ్చర్యపడ్డారు.

కాని యిన్ని సంగతులు తెలుసుకున్న నేనుకూడా దేవుడున్నాడా ? అనే ప్రశ్న వేసుకొని సమాధానం చెప్ప టానికీ, చెప్పుకోటానికీ ప్రయత్నిస్తాను. దేవుడున్నాడు—ప్రతి యుగానికీ దేవుడున్నాడు—ఒక్కొక్క యుగానికి ఒక్కొక్క దేవుడు. మృగదశలో వుండి, మాంసాహారులై, చెట్లు గుట్టల చుట్టూ దిమ్మతిరిగిన మన పూర్వులకు దేవు డున్నాడు. సైన్సు వృద్ధిపొందిందీ, దాని ధాటి కాగలేక దేవుడు శెలవు తీసుకుంటున్నాడూ, నిష్క్రమిస్తున్నాడూ, అని విర్రవీగే మనకు దేవుడున్నాడు. కాని భేద మెక్కడంటే మన దేవుడు మన పూర్వుల దేవుడు కాదు; మన పూర్వుల దేవుడు మన దేవుడుకాదు. కాలంతోపాటు ఉద్దేశాలు మారుతూ వచ్చాయి. ఉద్దేశాలతోపాటు దేవుడూ మారు తూవచ్చాడు. కనక, ఇక్కడ నేను దేవు డేవిధంగా జనన మొందాడో, బాల్య కౌమార దశలు ఏ విధంగా గడిపాడో, యిప్పుడేవిధంగా వుండి, ఎల్లకాలం 'కృష్ణా, రామా' అను కుంటూ గడుపుతున్నాడో వర్ణిస్తాను.

ప్రథమదశలో మానవు డీ ప్రపంచాన్ని, ఇందులో జరిగే ఘోరకృత్యాల్నీ, చిత్రవిచిత్రాలనీ చూచి, "చేయ బడేదున్నప్పుడు, చేసేవాడుండాలి. దీనికంతకూ ఎవ్వడో కర్త వుండాలి. ఎవ్వడబ్బా వాడు ?" అనే ప్రశ్న గడ్డంమీద వేలు వేసుకొని ఆలోచించటం మొదలు పెట్టాడు.

"ఆఁ. వాడే దేవుడు" అనే సమాధానం వచ్చింది.

సరే యివన్నీ చేయించేవాడు దేవుడు. "ఏమిటి దేవుడు చేయిస్తూ వున్న పనులు?" అనేది రెండో ప్రశ్న, దీనికి జవాబుకోసం మృగదశలోవున్న మానవుని పరిస్థితులు మనం అవగాహనం చేసుకోవాలి; జ్ఞాపకం తెచ్చుకోవాలి. అప్పటి మానవుడు రక్తపువాగుల్లా మునిగి తేలుతూ ఉండే వాడు. తన తోటిమానవుణ్ణి చంపటం; కనపడ్డ మృగాన్నల్లా చంపటం—— ఘోరవ్యాధులకు లోనవటం; నరకయాతన అనుభవించటం—పైగా యివన్నీ దేవుడే చేయిస్తున్నాడనే మూఢనమ్మకం "ఇం కేం! దేవుడు దుర్మార్గుడు" అన్నారు. ఈ దేవుణ్ణే జి. బి. యస్ "నోవాగారి దేవుడు క్రూరదైవం" అన్నాడు. ఈ దేవుడు బలులూ, వేటతలలూ కావాలం టాడు. ఇతణ్నే కవిరాజుగారు

'ముడుపు గట్టినగాని సమ్మోదపడడు
వేటతల జూచిగాని ఘోమోటపడడు——'

అని వర్ణించారు.

ఇతడు మాంసాహారి, రక్తపిపాసి; భయంకరమైన కోరలూ, కరాళవక్త్రమూ గల రాక్షసి. ఇతడు దేవునికోసం వెతుకుతూవున్న నల్లమ్మాయినిచూచి, "నేనే దేవుణ్ణి, సర్పంలో వున్న విషాన్ని చేసింది నేను; నీతల్లి రొమ్ములలో వున్న పాలను చేసింది నేను; కాళరాత్రినీ, పండువెన్నెలనూ చేసింది నేను; సృష్టించటం, నాశనం చెయ్యటం నా చేతి లోని పని. ఘోరవ్యాధులకు కారణం నేను; ఉరుములకూ, మెఱుపులకూ కారణం నేను; కొసరికొసరి వీచే మలయ మారుతానికీ, చుట్టుముట్టి సుడిముడి పెట్టే ప్రచండవాయూ

లానికీ కారణం నేను; నీబోటి వాళ్ళందరూ నాకు నమస్క-రించాలి. సాష్టాంగ దండప్రమాణ మాచరించాలి. అహో రాత్రులూ నన్ను ప్రార్థించాలి. మిఱుమిట్లు గొల్పే నా తేజస్సు మీరు చూడలేకపోతే, కళ్లు మూసుకొని నన్ను ధ్యానించాలి. కాని యీసారి నా దగ్గరకు వచ్చేటప్పుడు నీవు హృదయపూర్వకంగా ప్రేమించే నీ సంతానాన్ని తీసుకొనివచ్చి నాముందు తెగనరుకు. కొత్తకొత్తగా ప్రవహించే లేతరక్తం, ఎంత ఘుమఘుమాయిస్తూ వుంటుంది!" అన్నాడు గుటకలు మింగుతూ, చిటికెలు వేస్తూ.

"ఓ! నాకు సంతానం లేదు. నే నవివాహితను," అన్నదా నల్లమ్మాయి.

"అట్లయితే మీ తండ్రిని తీసుకొని వచ్చి, నిన్ను నా యెదుట చంపనియ్యి. నీ చుట్టాలందరిన్నీ వందలకొద్దీ గొర్రెల్నీ, మేకల్నీ తీసుకొనివచ్చి, నాకు బలి ఇమ్మనిచెప్పు. నాకిష్టమైన పనులు చేసినవారి కష్టం నేనుంచుకోను. వారికి—వారి భక్తి శ్రద్ధలకుగాను— మోక్షం కట్టబెడతాను. కాని నేను చెప్పినట్లు చెయ్యక, పెడదారి తొక్కితే వారికి ఘోరమైన వ్యాధుల్ని కలిపించి. అనేక కష్టనష్టాలను కలిగించి, డొక్క బద్దలు జేస్తాను. నేను దేవుణ్ణని వాళ్ళకు తెలియ జేస్తాను," అన్నాడు.

మన ద్రావిడజాతిలోని దేవుళ్ళందరూ యిదేరకం. అంకమ్మా, పోలేరమ్మా, మద్ది రామమ్మా, గంగానమ్మా మొదలయిన గ్రామదేవర్లందరూ ఇదేరకం. కొలుపుల పేరుతో నరహత్యలూ, గోహత్యలూ—అమ్మవారి పేరు

మీద—నిరాఘాటంగా సాగిపోతుంటాయి. అమ్మవారికి ఆకలై రక్తంమీదికి మనస్సుపోయినప్పుడల్లా మానవుల్లో క్షామమో, వ్యాధులో కల్పించి, తనకోర్కె వాళ్ళకు తెలియ జేస్తుంది. తక్షణం జీవరాసులుకుప్పలై కూలతై; రక్తం వాగులై పారుతుంది. అక్కడితో అమ్మవారి జిహ్వాచాపల్యం అణుగుతుంది.

మనవారి మహాకాళీ విగ్రహం చూస్తే, అప్పటి మానవుల దేవుడెట్టివాడో బోధపడుతుంది. భయంకరమైన మూర్తి; పుర్రెల హారం; బారలు చాచిన కటకు కత్తివంటి నాలుక; పెద్దవారిని సైతం భయభ్రాంతులను చేసే భీకర మైన చూపులు; మీనుమిక్కిలి శవాలపైన తాండవ నృత్య కేళి! ప్రథమ దశలోని మానవుడి దేవుని రూపిది. శివుడు స్మశానవాసి అని చెప్పినప్పుడూ, త్రినేత్రుడు అని చెప్పి నప్పుడూ, శివునకు పుర్రెల హారముంటుంది, పాముల పేర్లుం టాయి, అని చెప్పినప్పుడూ మన పూర్వులు మనకు వర్ణించి పెట్టిందీ దేవుణ్ణే.

క్రమేణా కాలం మారిపోయింది. మానవుడికి విమ ర్శించుకొనే జ్ఞానం కలిగింది. "ఇదేమి దేవుడు! ఇన్ని ఘోర కృత్యాలీదేవు డెందుకు చెయ్యాలి? మానవులు అతని ఆట వస్తువులా? చిలిపి: రాగాలకూచి: దేవుడు మనతో ఆడుకుం టున్నాడా? పిల్లికి చెలగాటైతే ఎలుకకు ప్రాణసంకటమని అతడు తెలుసుకోలేడా? తెలిసికూడా చెయ్యటాని కతని హృదయ మంత శిలాసదృశమా? అతగా డంత క్రూరుడా?

ఇంత కఠినుడు దేవుడెట్లయినాడు ?" అనే సందేహాలు మానవుని దయ్యాలలాగు ముసురుకోవటం మొదలు పెట్టినాయి.

అతడిక ఆపుకోలేక, దేవునిపై గుక్క త్రిప్పుకోనీయకుండా, ప్రశ్నలపై ప్రశ్నలు కురిపించటం మొదలుపెట్టాడు —"తమ రీపని ఎందుకు చేశారు ? మానవునిచేత యీ వెకిలి పనులు ఎందుకు చేయిస్తున్నారు ?" అని. చివరకు విసిగి, వేసారి, "యీ తికమక లేల పెట్టెదవు, తెల్పగరాదె నిజంబు నీశ్వరా !" అని ప్రార్థించాడు.

కాబట్టి యీ యుగంలోని దేవుడు మానవుని ప్రశ్నలకు సమాధానం చెప్పుకునే దేవుడైనాడు. తాను చేసిన కృత్యాలకు సంజాయిషీ చెప్పుకునే జవాబుదారీ మనిషైనాడు. కనుకనే యీ దేవుణ్ణి జి. బి. యస్ "వాదం చేతగానివాడు" అన్నాడు. ఈ దేవుని ఉద్దేశా లివి:—

"నా వల్ల భయపడవద్దు. నేను క్రూరుణ్ని కాదు. నేను హేతువాదిని. హేతువాదంకంటే మరోపని నాకులేదు. దానికీ నాకే పొత్తు. నా పూజవల్ల లాభంలేదు. నాదగ్గరికి వచ్చి, నన్ను నమ్మి, నాకు కోపంరాకుండా, ఏదైనా నంజుడు పెడితే దాన్ని రుచిచూచి నీ విషయం ఆలోచిస్తాను."

"ఈ ప్రపంచాన్ని చేసింది నీవేనా ?" అని అడిగింది, ఇతణ్ణి నల్లమ్మాయి.

"అవును నేనే !" అన్నాడు సగర్వంగా.

"అలాగయితే యీ ప్రపంచాన్నింత దుర్మార్గభూయిష్టమైందాన్నిగా ఎందుకు చేశావ్ ?" అని అడిగిందాబిడ.

"అమ్మాయీ, ఎల్లాంటి ప్రశ్న వేశావ్! ఈ ప్రశ్న నీ వడుగుతావనుకుంటున్నాను. సరిగ్గా ఆ ప్రశ్నే అడిగావు. ఆహా, ఎంత దొడ్డప్రశ్న! అహా! ఏమి నీ తెలివి తేటలు! ఇంత చిరుతప్రాయంలోనే ఇంతటి మేధస్సు ఎల్లా సంపాదించావు! పూర్వజన్మసుకృతఫలమా యేమి? కాని వొక్కసంగతి; నీ వెవ్వరవు నన్ని ప్రశ్న వెయ్యటానికి? ఏవిధంగా అర్హురాలవు? నీవింతకంటే మంచి ప్రపంచాన్ని చెయ్యగలవా? చెయ్యి చూతాం. ఒక్క చిన్న తిమింగిలాన్ని చెయ్యి. మరి నేనో! తిమింగిలాలను చెయ్యటమే కాకుండా, వాటికి వాసయోగ్యమైన సముద్రాలనుకూడా చేశాను. నీ వొక్క చిట్టెలుకను చెయ్యి చూతాము. ఒక్క చిన్న నీటిగుంటను చెయ్యి మజా తెలుస్తుంది. ఖబుర్లు చెప్పటంకాదు. ఇంకా పైగా నా చర్యలను ప్రశ్నిస్తావ్! సప్తసముద్రాలను చేసిన నన్ను, రాత్రింబగళ్ళను సృష్టించిన నన్ను, ఆదిమధ్యాంతరహితుడనైన నన్ను, నేడో రేపో, ముసలిపగ్గనై, కురూపివై, మరణించబోయే నీవా ప్రశ్నించేది?... ఏమంటావ్? నా ఆర్గుమెంటుకి ఏం జవాబు చెబుతావ్!" అన్నాడు జయోత్కంఠత తెల్పే కంఠస్వరంతో.

"ఇది ఆర్గుమెంటుకాదు! సమాధానం చెప్పలేక గింజుకోవటం," అన్న దాబిడ మొహం చిట్లించుకొని, "నీకు ఆర్గుమెంటు అంటే యేమిటో కూడా తెలియనట్లున్నది."

"నాయంతటివానికే ఆర్గుమెంటు అంటే ఏమిటో తెలియదంటున్నావ్?—నిన్ను చూస్తే నాకు నవ్వు వస్తోంది బిడ్డా!" అన్నాడు లోలోపల కుళ్లుతూ, బాగా ఉడికిపోతూ.

"నీ నవ్వంటే నాకు లెక్కలేదు—ప్రపంచమంతా కలిసి నవ్వినా నాకు లెక్కలేదు—కాని నే నడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పలేక తప్పించుకోటానికి ప్రయత్నిస్తున్నావ్? ప్రపంచాన్నంతా మంచిదాన్నిగా చెయ్యక మంచి చెడ్డలు రెంటినీకలిపి, యింత ముదనష్టంగా ఎందుకుచేశావ్? నేనే దేవుణ్ణయితేనా, నా ప్రజలెప్పుడూ పాపాలు చెయ్యరు. ఎందుకు చెయ్యాలి? వాళ్లు చేసిన పనులకు భాధ్యురాలను నేను కాదా? ఈ మాత్రం వివేచనాబుద్ధి దేవుడవైన నీకెలా లేకపోయింది? ఆ మాటకొస్తే నీవు పాములలో ఎందుకు విషం పెట్టావ్? ఆ విషం లేకపోతే అవి బ్రతుకలేవనా? మనుష్యులు మరణించలేరనా? నీవు కోతుల్ని అంత కురూపంగానూ, పక్షుల్ని అంత సౌందర్యయుతంగానూ, ఎందుకు చేశావ్? చెప్పు" అని గద్దించింది.

"ఎందుకు చెయ్యకూడదో చెప్పు?" అన్నాడు నెమ్మదిగా.

"ఎందుకు చెయ్యకూడదా? లేకిబుద్ధికాకపోతే ఎందుకు చెయ్యాలి?"

"ప్రశ్నలడిగేపద్ధతి యిదికాదు. నీ కసలు ప్రశ్నలడగటమే చేతకాదు."

"ప్రశ్నలకు సమాధానం చెప్పలేని దేవునివల్ల నాకు ప్రయోజనంలేదు. నేను పోతాను. నీ సంభాషణ విన్నకొద్దీ నిన్ను చూస్తే నాకు విసుగు, అసంతృప్తి జనిస్తున్నాయి. నీ వల్ల గడ్డిపోచంత పనైనా కాదు. పైగా, నేను దేవుణ్ణి, యీ ప్రపంచాన్నంతా నేనే చేశానూ, అని విఱ్ఱవీగుతావు. ఎవ్వరు

నీమాటలు నమ్మేది ? ఏమిటి నీమాటలకు దృష్టాంతరం ? నీవు తొల్లమనిషివని తెలుసుకోలేకపోవటానికి 'జాబ్' పొట్టి మతి మాలినవాడై వుండాలి. ఈ మహారణ్యంలో దేవుళ్ళమని చెప్పుకు బ్రతికేవాళ్లు కోటానకోట్లున్నారు.''

దీనికి జవాబుగా అతడొక పెద్ద శ్వాసిచేశాడు. నల్ల పూర్ణాయి గాభరాతో మైలు పరుగెత్తి వెనుదిరిగి చూచింది. అలసట తీరింతరువాత మనస్సులో 'పక్షపాతి ... కోతిగున్న' అనుకున్నది.

* * *

కాలం ఎవ్వరికోసం ఆగదు. ఎవ్వరి ప్రయత్నాల్లో వాళ్లుంటుగానే దానిపని అది చూచుకుంటుంది. కొన్ని సంవత్సరాలు గడిచాయి. మానవుని చిత్తప్రవృత్తి నానాటికీ మారుతూ వృద్ధిపొందుతూ వొచ్చింది. పూర్వుల తనకు తెలియని సంగతులు అనేకం తెలుసుకున్నాడు. దైవ సంఘటనాలు అని ఆశ్చర్యంగా చూచే పనుల్ని తానే చెయ్యగలుగుతున్నాడు. దీన్నిబట్టి దేవుడంటే మానవుని ఉద్దేశం తీవ్రమైన మార్పుకు గురైయింది. దేవునికి బలు లక్కరలేదు. రక్తమక్కర లేదు. అతడు వేలాది తైలప్రవాహాలు, లేక వర్షాలవల్ల తృప్తిపడతాడా ? లేకపోతే నీ ప్రథమసంతానం రక్తంవల్ల తృప్తిపడతాడా ? లేక, నీ మానసికభక్తితో సంతుష్టుడవుతాడా ? లేక నీ శరీర మాంసంతో సంతోషిస్తాడా? అనే స్థితి దాటింది. 'దేవుడు మానవుని ప్రశ్నలకు జవాబులు చెప్పుకోటానికి ప్రయత్నించే వెట్టిబానిసలవాడు కాదు. వెంకన్న, పుల్లన్న ప్రశ్నలకు సంజాయిషీ చెప్పుకోవలసిన

భాధ్యత ఆయనయందు లేదు. కాబట్టి న్యాయంగా వర్తించు, భూతదయ కలిగివుండు, అతణ్ణి సమాశ్రయించు' అన్నారు. బైబిల్లోని యీ దేవుణ్ణే జి. బి. యస్. "మిశాగారి దేవుడు" అని వర్ణించారు. ఈ సంగతే మనబుద్ధుడూ చెప్పాడు. "దేవుడుంటే నీ కెందుకు? లేకపోతే నీ కెందుకు?—ధర్మం చర" అన్నాడు.

ఈరోజునుంచే గొప్పగుణాలు కలవాళ్లందరూ దేవుళ్లుగా పరిగణింపబడుతూ వచ్చారు. ధర్మాత్ములూ, సహృదయులూ దేవుళ్ళయినారు. క్రమేణా ఏగొప్పగుణమున్నవాడయినా దేవుడైనాడు. ఏకపత్నీవ్రతుడైనందుకు శ్రీరాములవారు దేవుడైనారు. రాజకీయవేత్త అయినందులకు శ్రీకృష్ణుడు దేవుడైనాడు. దేవునిసంగతే ఎత్తుకోకుండా, జాగ్రత్తగా జారవిడిచి, "ధర్మంచర, సత్యంవద" అని మాత్రమే బోధించిన బుద్ధుడు దేవుడైనాడు. "నీ పొరుగు వాణ్ణి నీలాగే ప్రేమించు" అని చెప్పినందులకుగాను ఏసు క్రీస్తు దేవుడైనాడు. "నా మాటప్రకారం ప్రవర్తించిన వారికి మోక్షం ప్రాప్తిస్తుంది. నామాట పెడచెవిని పెట్టిన కాఫరులకు దుర్మరణం ప్రాప్తిస్తుంది," అని మతము నొక చేతా, ఖడ్గము నొకచేతా పట్టుకొన్న మహమ్మదు దేవుడైనాడు. సత్యాగ్రహం ద్వారా, సహాయ నిరాకరణంద్వారా, "యీ చెంపమీద కొడితే ఆ చెంప చూపెట్టు" అని బోధించి, ఆచరిస్తున్నందుకుగాను గాంధీ దేవుడవుతున్నాడు.

"బలులకోసం ప్రజలను హింసించే దేవునికన్నా, నాతోవాదనకు దిగమని తన భక్తుల్ని ప్రార్థించే దేవుని కన్నా, యీ రకం దేవుడే నాకు నచ్చాడు. కాని మరో

గొప్ప చిక్కు వచ్చింది. నీకు చెబుతున్నా. ఆయన చెప్పినట్లే వింటాం. ఆయన అడుగుల్లో అడుగులు వేసుకుంటూ పోతాం. కాని ఎక్కడికి ప్రయాణం? గమ్యస్థానమేది? గమ్యస్థానం తెలియకుండా 'కాననివాని భంగి' ప్రాకిపోతే ఏం లాభం?" అన్న దాబిడ.

"దేవుడే నీకు తోడునీడై దారిచూపిస్తుంటే అతడెక్కడకు తీసుకొనిపోతే నీ కెందుకు? అతడెక్కడకు తీసుకొని పోతే అదే స్వర్గం" అన్నాడతను.

"అదెలా? అతను చూట్టానికి నాకు నేత్రాలు ప్రసాదించాడు. ఆలోచించటానికి మెదడు నిచ్చాడు. నేను స్వయం ప్రకాశంగా ఉండాలని ఆయన కోరిక. అట్టిచో, నాకోసం చూచిపెట్టమనీ, నాకోసం ఆలోచించిపెట్టమనీ, నా కర్మను నిర్ణయించి పెట్టమనీ ఆయన్ని నే నెల్లా అడిగేది?" అన్నది.

అతను మానముద్రాంకితుడైనాడు.

* * * *

మరికొన్ని సంవత్సరాలు గడిచినై. మానవుని ఉద్దేశాలు మారినై. దానితోపాటు దేవుడూ మారాడు.

"దేవుడెక్కడ వున్నాడు?" అని అడిగిందా నల్లమ్మాయి.

"నీలో, నాలోకూడ" అన్నాడు ఏసుక్రీస్తు.

"నేనే దేవుణ్ణి" అన్నాడు రామతీర్థ.

"ఇందుగల డందు లేడను సందేహము వలదు. అంతటా ఉన్నాడు. నాలో ఉన్నాడు. నీలో ఉన్నాడు. మళ్ళీ మాట్లాడితే ఆ స్తంభంలో ఉన్నాడు" అన్నాడు ప్రహ్లాదుడు.

"అంటే ప్రత్యేకం దేవుడనేవాడు లేనట్టేగా!"

"ఉండీ లేనట్టుగా, లేకుండీ వున్నట్టుగా వున్నాడు!"

"సరే; అతగా డెవ్వడు?" అన్నదాబిడ.

"మన తండ్రి."

ఆ అమ్మాయి కొంచెంసేపు దీర్ఘంగా ఆలోచించి—

"తల్లెందుకు కాకూడదు?" అన్నది.

సై వేదాంతులందరూ "మేః మేః" అన్నారు.

"దేవుడు తండ్రయితేం? తల్లయితేం? మనం వొకరి నొకరు సోదర సోదరీ భావంతో ప్రేమించుకుందాం. మన విరోధుల్ని మనం ప్రేమిద్దాం—మనల్ని శపించినవాళ్ళని మనం దీవిద్దాం" అన్నారు.

"ప్రేమే దేవుడన్నమాట!"

"అవును."

"అందరిచేతా ప్రేమింపబడటం నా కిష్టంలేదు. అందర్నీ ప్రేమించటం నా కంతకన్నా యిష్టంలేదు. పాముల విధంగా చంపబడటానికి అర్హులైనవాళ్ళీ ప్రపంచంలో అనేక మంది ఉన్నారు. మహమ్మదు అన్నట్టు, 'బ్రతకటానికి జాస్తిగా అనర్హులను మనం చంపివెయ్యాలి.' తోట వృద్ధిజెంది ఫలపుష్పాలను యివ్వటానిగ్గాను నీళ్లూ పెట్టాలి, కలుపూ తియ్యాలి. అట్టిచో, విశ్వమానవప్రేమ మాట మాత్రమే

అవుతుందిగాని కార్యరూపేణా చూపెట్టటానికి ఎల్లా వీలవుతుంది ? అదీకాకుండా, ప్రేమ ప్రేమ అంటున్నావ్ ! ప్రేమ అంత దొడ్డదా యేమి ? ప్రేమను పొగడటమూ, యీ ప్రపంచంలో ప్రేమ లేకపోతే మిగిలేదేమీ లేదని చాటించటమూ ఒక వ్యసనమూ, ఆచారమూ అయింది.

ప్రేమకన్నను యెక్కు
వేముందిరా, యెల్ల
కామ్యపదవులకన్న
ప్రేమ యెక్కువరా,
ప్రేమించు సుఖముకై
ప్రేమించు ముక్తికై
ప్రేమించు ప్రేమకై
యేమింక వలయురా !

అంటున్నారు, ప్రతీవ్యక్తీ నేడు. కాని నిజంగా ప్రేమ యింత ఉన్నతమైందా ? కాదు. ఒకరి నొకరు ప్రేమించటం అంటే ఒకరి నొకరు లోబరచుకోటానికి ప్రయత్నించటం అన్నమాట. నేను నిన్ను ప్రేమిస్తున్నానంటే నిన్ను తీసివేసి నాలో వొక భాగంగా చేసుకుంటున్నా నన్నమాట. ఇక నుంచీ నీవు నీ కిష్టమైన పనులు చెయ్యటానికి వీల్లేదు. నా కిష్టమైన పనులు నీవు చెయ్యాలి. నన్ను సంతోషపెట్టటానికి నీవు ప్రయత్నించాలి. నిన్ను సంతోషపెట్టుకోటానికి కాదు. నేను నీకూ నీ వ్యక్తిత్వానికీ, నీకూ దేవునికీ మధ్య నిలబడి, నీకు మార్గావరోధం కలిగిస్తున్నాను. నీ వ్యక్తిత్వానికీ నీకూ సంబంధం లేకుండా చేస్తున్నాను. నిన్ను నీ దేవుణ్ణి చేరకుండా చేస్తున్నాను. ఇది చాలా నిరంకుశమైన పని. ప్రేమ మానవుని

అమాంతంగా మ్రింగి వేసే ఒక భయంకర మాయామృగం ! అసలు సంగతి ఇదైతే, కవు లందరూ ప్రేమను కీర్తించి ఆకాశాల్లోకి లేవనెత్తి అమాయకహృదయులను ప్రపంచానికి పనికిరాని అశక్యులనుగా తయారుచేస్తున్నారు. 'నాది, నేను' అనే అహంకారాన్ని చంపి మానవుని ఏ పని చెయ్యి టానికీ శక్తిలేని జీవచ్ఛంగా చేస్తున్నారు. దీనివల్ల ప్రపంచం ఎంత అధోగతికి పోతుందో తెలుసుకోలేకున్నారు. అందు కనే కవులు వ్రాసిన పద్యాలను చదువుకొని ఆనందించవల సిందేగాని, వాటిని శిలాక్షరములుగా తీసుకొని ఆచరణలో పెట్టగూడదు. వారి తలలు ఆకాశంలో ఉంటాయి; పాదాలు మాత్రం భూమిమీద ఉండవు'' అని ఉపన్యసించిందావిడ ఆవేశంతో తూలిపోతూ !

ప్రేమ–దేవుడు నిలువుగుడ్లు వేశాడు.

* * *

కాని కాలం మారినకొద్దీ, యీ 'ప్రేమే దేవుడు' అనే ఉద్దేశం కూడా కాలప్రవాహంలో బుటకవేసింది. కాల ప్రవాహం రాపిడికి యీ ఉద్దేశాలా ఆగేది! మానవుడుఆదాం అవ్వలనుంచి రాలేదు; దేవుని మొహంలోనుంచీ, ఊరు భాగంలోనుంచీ, పాదాలలోనుంచీ కాదు వచ్చింది అని తేలింది. కోతుల్లోనుంచి వచ్చారని నిర్ధారణయింది. దేవు డెవ్వడు ? నిరాకారుడు, నిరంజనుడు అని మొదలుపెట్టారు. దేవుడెవడు ? అనే ప్రశ్నకు ఏయే వస్తువు దేవుడు కాదో చెప్పటం మొదలుపెట్టారు. కాని దీనివల్ల తేలేదేమున్నది ?

''గోపీచంద్ ఎవ్వరు ? అని అడిగినప్పుడు 'గోడ కాదు', 'నక్క కాదు', 'పిల్లి కాదు', 'గోంగూర కాదు' అని

చెప్పుకుంటూపోతే గోపీచంద్ ఏమిటో తేలేదెప్పుడు ?" అని ప్రశ్నించింది నల్లమ్మాయి. దీనికి జవాబు చెప్పలేక యే పేచీ లేకుండా, 'పిపీలికాది బ్రహ్మపర్యంతం ఆవరించుకొని వున్న దీ పరబ్రహ్మం' అన్నారు వేదాంతులు.

ఏది చరాచరంబయిన సృష్టికి సర్వము మూలకారణం
బేది మునీశ్వరప్రతతి కేని యగోచరమైన దొడ్డ వె
ల్గేది లయాంతమందయిన నించుక నైకృత మందకుండు-

అట్టి నిత్యసత్యపరతత్వ మహాత్వమే దేవుడన్నాడు నేటి కవి రాజుగారు. ప్రపంచానికి అంటకుండావుండి దాన్ని నడిపిస్తూ వున్న ఒక మహాశక్తి; జీవశక్తి; పరిణామోత్సాహంగల నిర్నిరోధమైన యీ శక్తి దేవుడంటున్నారు బెర్నార్డ్షా మొదలయిన మెట్టవేదాంతులు.

"ఈ శక్తి పనేమిటి ?" అని ప్రశ్నించింది నల్లమ్మాయి.

"ప్రపంచాన్ని నడిపించటం"

"అయితే మానవుడు చేసే పనేమిటి ?"

వేదాంతులు ఒకరిమొకాలు ఒకరు చూచుకున్నారు.

"మానవుడు ప్రయత్నంచేస్తే ఈ శక్తిని లోబరచుకో వొచ్చు" అన్నారు వేదాంతులు.

"ఎందుకు ?" అడిగింది నల్లమ్మాయి.

వేదాంతులు జవాబు చెప్పలేకపోయారు.

"అయ్యో రామా ! ఇదేం దేవుడు ? మానవునికు లొంగే దేవుడు" అని తుర్రున పరిగెత్తింది నల్లమ్మాయి.

ఇంతకూ యీ గొడవవల్ల తేలిందేమిటి? దేవునికోసం వెదకటం నిష్ప్రయోజనం. గొప్పవారి మెదడులోనూ, గ్రంథకర్తల పుస్తకాల్లోనూ మాత్రమే వాడి ఉన్నిక మవుతుంది. ఈ ప్రదేశాల్లోనే వాడు ప్రత్యక్షమవుతుంటాడు. చివరకు బోధిచెట్టుకింద నిండోని, ఈ సంగతి గ్రహించి, ఒక్క నిట్టూర్పు విడిచి యీ విధంగా నిర్ణయించుకుంది సల్లమార్రాయి.

"దేవునికోసమై ఇంత ఆర్భాటమెందుకు? ఇంత వృథా కాలయాపన ఎందుకు? నేను రావలసివచ్చినరోజు అతగాడే నన్ను వెతుక్కుంటూ వస్తాడు."

## సానుభూతి

ఒక కవి తన స్నేహితుడైన ధనవంతుని దగ్గరకు వెళ్ళి ఇలా అడిగాడు—"ఒక్క అయిదు రూపాయలుంటే బమలిస్తుంది. ఇంట్లో బియ్యంలేవు. గోలగావుంది" అడగలేక అడగలేక తల దించుతూ అడిగాడు.

"నా దగ్గర దమ్మిడీలేదు. డబ్బెక్కడనుంచి వస్తుంది? నా దొడ్లో పండుతూవుందా? అడిగితే నే ఏమిస్తా క్షమించేసు" అన్నాడు ధనవంతుడు.

"నా కెప్పుడిచ్చారు?"

"నువ్వు మరణించిన తర్వాత శిలావిగ్రహానికి ఇవ్వొద్దూ? ఇప్పుడూ ఇచ్చి, అప్పుడూ ఇచ్చి నా కిదేపనా?" అన్నాడు ధనవంతుడు.

కవికి ఆరోజు రాత్రి కలలో బొమ్మలు కనపడినై. తన భార్యాపిల్లలు తిండిలేక ఒక ఘోరమైన నిమిత్తాముంటే, ఒకపక్కన తన శిలావిగ్రహం తయారవుతూ వుంటుంది. ఆ శిలావిగ్రహానికి డబ్బిచ్చిన ధనవంతుని దాతృత్వాన్ని, సహృదయాన్ని ప్రజలు వేనోళ్ళ కొనియాడుతూ వుంటారు.